నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644

సంచిక : 10 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 13-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

నడక - తల్లి తండ్రి, నడత-గురువుగారు
శిక్షణిచ్చుమనకు రక్షజేసి
బ్రతుకు బడిన మనము పనితనమును సూప
గెలుపు తథ్యమగును తెలుగు బిడ్డ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.


## 15 నుంచి మోదీ..
# విదేశీ పర్యటన

- ఐదు దేశాల్లో పర్యటించనున్న పీఎం
- యూఏఈ నుంచి ఇటలీ వరకు..
- ఆయా దేశాల అధినేతలతో కీలక చర్చలు



న్యూఢిల్లీ,
అంతర్జాతీయ వేదికపై భారత్ దౌత్య పటిమను చాటేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరు రోజుల పాటు ఐదు కీలక దేశాల్లో పర్యటించనున్నారు. ఈ నెల 15వ తేదీన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తో ప్రారంభమయ్యే ఈ పర్యటన నెదర్లాండ్స్, -మిగతా 2 లో

## అసోం సీఎంగా
# హిమంత బిశ్వశర్మ ప్రమాణం

- వరుసగా రెండోసారి..
- ఆయనతో పాటు మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణం
- హాజరైన ప్రధాని మోదీ, అమిత్ షా, చంద్రబాబు
- వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ-ఎన్డీయే కూటమి



గౌహతి,
అసోంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి వరుసగా మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకుంది. ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ వరుసగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. గువాహటిలోని ఖానాపారాలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఏపీ ముఖ్యమంత్రి -మిగతా 2 లో




# నీట్ పరీక్ష రద్దు !

- సంచలన నిర్ణయం తీసుకున్న ఎన్టీఏ
- రాజస్థాన్‌లో ప్రశ్నపత్రం లీక్ కావడమే కారణం
- దర్యాప్తు చేస్తున్న సీబీఐ
- ఇప్పటికే పలువురి అరెస్ట్
- త్వరలోనే కొత్త తేదీలో పరీక్ష
- ఎటువంటి అదనపు ఫీజు లేకుండానే పరీక్షకు అనుమతి

న్యూఢిల్లీ,
పేపర్ లీక్ వ్యవహారం నేపథ్యంలో దేశవ్యాప్తంగా వైద్య విద్యా ప్రవేశ పరీక్షకు సంబంధించి నీట్ యూజీ 2026 రద్దయ్యింది. మే మూడున నీట్ యూజీ పరీక్ష జరిగింది. ఆ పరీక్షను రద్దు చేయాలని ఎన్టీఏ నిర్ణయం తీసుకుంది. పరీక్ష పేపర్ లీక్‌పై కేంద్రం సీబీఐ దర్యాప్తుకు ఆదేశించింది. పరీక్షకు సంబంధించి కొత్త షెడ్యూల్ త్వరలో విడుదల కానుంది. ఈ మేరకు ఎన్టీఏ ఒక ప్రకటన విడుదల చేసింది. వైద్య విద్యకు సంబంధించి దేశవ్యాప్తంగా మే నెల మూడున నీట్ 2026 ప్రవేశ పరీక్ష జరిగింది. ఆ పరీక్షకు సంబంధించి రాజస్థాన్‌లో ప్రశ్నపత్రం లీక్ అయినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఎన్టీఏ కీలక నిర్ణయం తీసుకుంది. నీట్ ఎగ్జామ్ -మిగతా 2 లో

## ప్రతి గింజా
# కొనాల్సిందే

### మిషన్ మోడ్‌లో ధాన్యం సేకరణ

- కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని సహించం
- రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగనీయద్దు
- క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా కలెక్టర్ల పర్యవేక్షణ ఉండాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు



హైదరాబాద్ మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
మిషన్ మోడ్‌లో పనిచేసి రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును -మిగతా 2 లో



## జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల
# రెండో విడత పంపిణీ

- ఆదిలాబాద్‌లో ఆరంభించనున్న ప్రభుత్వం
- నియోజక వర్గం యూనిట్ గా స్థలాల గుర్తింపు
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపుపై స్పెషల్ డ్రైవ్
- హైదరాబాద్‌లో ఇండ్ల స్థలాలు కలిగిన వారికి ఇళ్ల మంజూరు పత్రాలు
- అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా సహించం
- ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

హైదరాబాద్ మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఏ.రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లా వారీగా ప్రజా ప్రతినిధులతో -మిగతా 2 లో



## పాస్‌పోర్ట్ సూచీలో
# దిగజారిన భారత్

- 3 ర్యాంకులు పతనమై 78వ స్థానం
- 2006లో 71వ ర్యాంకు

న్యూఢిల్లీ
మోదీ హయాంలో పలు కీలక అంతర్జాతీయ సూచీల్లో భారత్ దిగజారుతున్నది. తాజాగా హెన్లీ పాస్‌పోర్టు సూచీలో భారత్ మూడు ర్యాంకులు క్షీణించి 78వ స్థానానికి చేరుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించిన ఇదివరకటి సూచీలో భారత్ 75వ స్థానంలో ఉంది. అంతర్జాతీయ విమాన రవాణా సంఘం(ఐఏటీఏ) నుంచి సేకరించిన డాటా ఆధారంగా రూపొందించే ఈ సూచీ ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు వీసా లేకుండా ప్రవేశం కల్పించే సామర్థ్యం ఆధారంగా పాస్‌పోర్టులకు ర్యాంకులను ఇస్తుంది.192 గమ్యస్థానాలకు వీసారహిత ప్రవేశం కల్పిస్తూ సింగపూర్ ప్రపంచ పాస్‌పోర్టు ర్యాంకింగ్‌లో అగ్రస్థానంలో ఉంది. దాని తర్వాత యూఏఈ, -మిగతా 2 లో

# బేటా భగావో .. బేటా బచావో

### తెలంగాణలో ఇదే ప్రస్తుత స్లోగన్

- పోక్సో కేసులో భగీరథ్ ను అరెస్ట్ చేయకపోవడంపై కేటీఆర్ ఆగ్రహం
- ఇంతకీ భగీరథ్ పరారీలో ఉన్నాడా అంటూ పోలీసులకు ప్రశ్న



హైదరాబాద్,
బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడి.. పోక్సో కేసులో ఇరుక్కున్న కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్ ను పోలీసులు ఇంకా అరెస్టు చేయకపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని -మిగతా 2 లో

## అమృత్ కాలం కాదు..
# విష యుగం!

- నీట్ పేపర్ లీకేజీపై ప్రతిపక్షాల ఆగ్రహం



హైదరాబాద్,
నీట్-యూజీ పరీక్ష రద్దుపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. నీట్ లీకేజీ దేశ యువతపై జరిగిన నేరమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్రంపై మండిపడ్డారు. ప్రధాని మోదీ చెప్తున్న అమృత కాలం.. దేశానికి విష యుగంగా మారిందన్నారు.డీఎంకే చీఫ్ స్టాలి న్ స్పందిస్తూ.. నిర్వాహణ ప్రక్రియలో ప్రతి దశలోనూ మోసం కనబడుతున్నదన్నారు. విద్యార్థులు పెద్దయెత్తున -మిగతా 2 లో

## మధ్యవర్తిగా
# పాక్‌ని నమ్మలేం

### తాజా పరిస్థితులపై ట్రంప్ ఆందోళన



- అమెరికా, ఇరాన్ శాంతి చర్చలకు పాక్ వేదిక
- పాక్ వ్యవహారంపై అధికార వర్గాలకు అనుమానాలు
- ఇరాన్ పై మళ్లీ దాడులకే మొగ్గు చూపుతున్న అమెరికా
- తదుపరి కార్యాచరణపై ట్రంప్ సర్కారులో విభేదాలు

వాషింగ్టన్:మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
ఇరాన్ – అమెరికా శాంతి చర్చల్లో మధ్యవర్తిగా పాకిస్థాన్ పోషిస్తున్న పాత్రపై అమెరికా ప్రభుత్వ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికా దాడుల నుంచి కాపాడేందుకు ఇరాన్ సైనిక విమానాలను తన విమానాశ్రయాలలో నిలిపి ఉంచడానికి పాక్ అనుమతించిందని అమెరికన్ మీడియా కథనాలతో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. కుటిల వైఖరిని కలిగిన పాక్ ను ఇక నమ్మడం నమ్మడం సరికాదని ప్రెసిడెంట్ డొనాల్డ్ -మిగతా 2 లో





## తెలంగాణకు 22,
# ఏపీకి 10 టీఎంసీలు

- కృష్ణా జలాలు పంపిణీ చేయాలని కేఆర్ఎంబీ నిర్ణయం
- ఈ నెల 14న మరోసారి సమావేశం

హైదరాబాద్ మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
వేసవిలో తాగు నీటి అవసరాలకు గాను తెలంగాణకు 22 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 10 టీఎంసీల కృష్ణా జలాలను విడుదల చేయాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, ఏ రాష్ట్రానికి ఎంత నీరు విడుదల చేయాలనే అంశంపై చర్చించి ఈ వేసవి వాటాలను బోర్డు నిర్ణయించింది. తాగునీటి అవసరాల కోసం -మిగతా 2 లో

## ముందస్తుగానే
# ‘నైరుతి’!

- వాతావరణ శాఖ చల్లటి కబురు
- ఈ వారం చివరి నాటికి అండమాన్‌కు: ఐఎండీ



న్యూఢిల్లీ, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
: దేశ ప్రజలకు వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. నైరుతి రుతు పవనాలు ఈ వారం చివరినాటికి బంగాళాఖాతం , అండమాన్, నికోబార్ సమీప ద్వీపాలకు చేరుకుంటాయని తెలిపింది. ఇందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. సాధారణంగా మే 20 నాటికి అండమాన్, నికోబార్ దీవులకు చేరుకుంటాయి. అనంతరం దేశవ్యాప్తంగా విస్తరిస్తాయి. జూన్ 1న కేరళను తాకుతాయి. భారత ఉపఖండంలో నాలుగు నెలల వర్షాకాలం ప్రారంభానికి దీనిని సూచికగా భావిస్తారు.

### 15 నుంచి మోదీ..
# విదేశీ పర్యటన

మొదటి తరువాయి

స్వీడన్, నార్వేల మీదుగా సాగి లిమే 20వ తేదీన ఇటలీలిలో ముగియనుంది.
ముందస్తు ప్రణాళికలు:
మొదట యూఏఈ: ఈ నెల 15వ తేదీన యూఏఈ అధ్యక్షుడిని కలిసి ఇంధన సహకారం, వాణిజ్యం, భారతీయ సమాజ సంక్షేమంపై చర్చించనున్నారు.
ఆ తర్వాత స్వీడన్: మే 17న స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్‌లో పర్యటించి గ్రీన్ ట్రాన్సిషన్, స్పేస్, రక్షణ రంగాల్లో చర్చలు జరుపుతారు.
నెదర్లాండ్స్‌లో టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్: మే 17 వరకు అక్కడే ఉండి రక్షణ, గ్రీన్ హైడ్రోజన్, సెమీకండక్టర్లు మరియు నీటి నిర్వహణపై కుదుర్చుకున్న ఒప్పందాలను సమీక్షిస్తారు.
నార్వేలో ఇండియా-నార్డిక్ సమ్మిట్: 43 ఏళ్ల తర్వాత భారత ప్రధాని నార్వే వెళ్లడం ఇదే తొలిసారి. మే 18న నార్వే రాజుతో పాటు ప్రధానితో దౌత్యపరమైన చర్చలు జరిపి, 3వ భారత్-నార్డిక్ సమ్మిట్‌లో పాల్గొంటారు.
చివరి దశలో ఇటలీ పర్యటన: మే 20న ఇటలీ చేరుకుని ప్రధాని జార్జియా మెలోనీతో కలిసి 'జాయింట్ స్ట్రాటజిక్ యాక్షన్ ప్లాన్ 2025-2029' అమలుపై సమీక్ష నిర్వహిస్తారు.
మొత్తానికి ఐరోపా దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల నేపథ్యంలో, ఈ పర్యటన భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అసోం సీఎంగా హిమంత బిశ్వశర్మ ప్రమాణం

మొదటి తరువాయి

చంద్రబాబు, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. సీఎంగా హిమంత బిశ్వ శర్మతో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు.
అసోం సంప్రదాయ వస్త్రధారణలో ఉన్న శర్మ, ప్రమాణం చేస్తున్న సమయంలో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హిమంతతో పాటు మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో కేంద్ర మాజీ మంత్రి రామేశ్వర్ తేలి, అసోం గణ పరిషత్ (ఏజీపీ) అధ్యక్షుడు అతుల్ బోరా, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ (యూపీపీఎల్) నేత చరణ్ బోరో, సీనియర్ బీజేపీ నేత అజంత నియోగ్ ఉన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్‌తో పాటు 22 ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ జాతీయ నాయకులు హాజరయ్యారు. వీరితో పాటు అస్సాంలోని వైష్ణవ మఠాలకు చెందిన 15 మంది సత్రాధికారులు వంటి ప్రముఖ మత పెద్దలు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.
బీజేపీ రాజకీయ ఆధిపత్యం సుస్థిరం
ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి స్పష్టమైన ఆధిక్యంతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఎన్డీయే బృందానికి 102 సీట్లు వచ్చాయి. అసోం అసెంబ్లీలో 126 మంది సభ్యులు ఉండగా, దాంట్లో బీజేపీ 82 స్థానాలను చేజిక్కించుకున్నది. ఏజీపీ, యూపీపీఎల్ పార్టీలు చేరి పది సీట్లు గెలుచుకున్నాయి. దీంతో హిమంత బిశ్వ శర్మ రెండోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఆయన తొలిసారిగా 2021లో సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన నాయకత్వంలో బీజేపీ ఈశాన్య రాష్ట్రమైన అసోంలో తన రాజకీయ ఆధిపత్యాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. ప్రమాణ స్వీకారానికి ముందు బీజేపీ, ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా హిమంత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### పాస్‌పోర్ట్ సూచీలో
## దిగజారిన భారత్

మొదటి తరువాయి

దక్షిణ కొరియా, జపాన్ ఉన్నాయి.
**2006లో 71వ ర్యాంకు**
భారత పాస్‌పోర్టు 2006లో 71వ ర్యాంకుతో తన అత్యున్నత స్థాయికి చేరుకుంది. ఇప్పుడు ఇది బుర్కినా ఫాసో, క్యూబా, సెనెగల్‌తో కలిసి 78వ స్థానాన్ని పంచుకుంటున్నది. హెన్లీ పాస్‌పోర్టు సూచీ ప్రపంచవ్యాప్తంగా 199 దేశాలను మూల్యాంకనం చేస్తుంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా భారత పాస్‌పోర్టు బలహీనపడి ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు.

## బేటా భగావో .. బేటా బచావో

మొదటి తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బేటీ బచావో – బేటీ పడావో అనేది ఒరిజినల్ స్లోగన్ అయినప్పటికీ ఇప్పుడు కొత్త నినాదం తెరమీదకు వచ్చిందని తెలిపారు. బేటా భగావో – బేటా బచావో అనే నినాదాన్ని బీజేపీ, కాంగ్రెస్ పాటిస్తున్నాయని మండిపడ్డారు. వెల్ డన్ కాంగ్రెస్ అండ్ బీజేపీ అని వ్యాఖ్యానించారు.
అంతకుముందు ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో నిందితునిగా ఉన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ను పోలీసులు అరెస్టు చేయకపోవడంపై పలు రకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న స్పెషల్ ఆఫీసర్ రితిరాజ్ గైక్వాడ్ మీడియాతో మాట్లాడుతూ.. పోలీసులు ఆయన కాల్ డేటాను సేకరిస్తున్నారని, దొరకగానే పట్టుకుంటామని తెలిపారు. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'కేంద్ర హోంమంత్రి కుమారుడు పరారీలో ఉన్నాడా? దేశ చరిత్రలో ఇదే మొదటి సారా?' అని ప్రశ్నించారు.

## అమృత్ కాలం కాదు.. విష యుగం!

మొదటి తరువాయి

ఉద్యమించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ కేజ్రీవాల్ పిలుపునిచ్చారు. పరీక్షను పూర్తిగా రద్దు చేయాలని ఆర్జేడీ డిమాండ్ చేసింది. పేపర్ లీకేజీలతో పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో విశ్వసనీయత దెబ్బతింటున్నదని సీపీ ఎం ఆందోళన వ్యక్తం చేసింది.

## తెలంగాణకు 22, ఏపీకి 10 టీఎంసీలు

మొదటి తరువాయి

నాగార్జునసాగర్ నుంచి 10 టీఎంసీలు ఏపీకి, తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి 5 టీఎంసీల వినియోగానికి కేఆర్ఎంబీ అనుమతిచ్చింది. ఏపీ ఇప్పటికే ఎక్కువ నీరు వాడుకుందని సమావేశంలో తెలిపిన తెలంగాణ, సాగర్‌లో ఏపీకి 10 టీఎంసీలు పోగా మిగిలిన మొత్తం నీరు తమకే చెందుతుందని వాదించింది. తాగునీటి అవసరాల కోసం నీటిని అడుగుతున్నట్టు ఏపీ ఈఎన్సీ తెలిపారు. మిగతా అంశాలు కాకుండా అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి కోసం వినియోగించుకునేలా నిర్ణయం తీసుకుందామని బోర్డు సభ్య కార్యదర్శి తెలిపారు. దాంతో రెండు రాష్ట్రాలు బోర్డు నిర్ణయాన్ని అంగీకరించారు. కాగా తమకు 18 టీఎంసీలు కావాలని తెలంగాణ అభ్యర్థించగా, మరో మూడు టీఎసీలు అదనంగా కేటాయించడం గమనార్హం. ఈ ఒప్పందం ఆగస్టు 15 వరకు అమల్లో ఉంటుందని కేఆర్ఎంబీ వర్గాలు తెలిపారు. ఈ నెల 14న కేఆర్ఎంబీ 21వ సమావేశం జరగనుంది. కృష్ణానది నీటి వాటాలు, శ్రీశైలం, నాగార్జున సాగర్ నిర్వహణ, ఇతర అంశాలపై చర్చించనున్నారు. ఈ సమావేశంలో కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీష్ కాంబోజు, తెలంగాణ, ఏపీలకు చెందిన ఈఎన్సీలు రమేశ్‌బాబు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

# ప్రతి గింజా కొనాల్సిందే

మొదటి తరువాయి

పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవడంతోపాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్ కు తరలించాలని ఆదేశించారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచి కాంట్రాక్టర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని, అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు కూడా వెనకాడొద్దన్నారు.
ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతి అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిందేనన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. వివిధ ప్రాంతాల్లో గోడౌన్స్ సమస్య ఉన్నట్లు తెలుస్తోందని, అలాంటి ప్రాంతాల్లో అవసరానిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాళ్లను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రిపోర్ట్ పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.
అకాల నష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యేక వ్యవస్థ
అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాల సమయంలో కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలని, వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించి కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. ధాన్యం లోడింగ్ లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలని, అలా చేస్తే తూకం, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చని చెప్పారు. లారీల కొరతను అధిగమించేందుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అద్దంకి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, శాంతికుమారిలు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష రద్దు !

మొదటి తరువాయి

రద్దు చేస్తున్నట్లు ప్రకటన చేసింది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జాతీయ పరీక్షా వ్యవస్థ పారదర్శకతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.
లోతుగా దర్యాప్తు
కేంద్ర దర్యాప్తు సంస్థల ప్రాథమిక సమాచారం మేరకు నీట్ పరీక్ష పేపర్ లీక్ అయినట్లు తేలింది. ఈ నేపథ్యంలో ఎన్టీఏ కఠిన నిర్ణయం తీసుకుంది. రాజస్థాన్‌లో పరీక్షకు ముందే పేపర్ ఎలా సర్క్యులేట్ అయింది? దీనివెనుక ఏమైనా మూలాలు ఉన్నాయా? అన్నకోణంలో లోతుగా దర్యాప్తు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించింది. విచారణకు అవసరమైన అన్ని రికార్డులను సీబీఐకి అందజేస్తామని ఎన్టీఏ పేర్కొంది. మే మూడున నీట్ యూజీ 2026 పరీక్ష కెమిస్ట్రీలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును రాజస్థాన్ పోలీసులు గుర్తించారు. ఈ విషయాన్ని రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సల్, ఎస్ఓజీ అధికారులు స్వయంగా వెల్లడించారు. పరీక్షకు 42 గంటల ముందు ఆ పేపర్ రాజస్థాన్‌లోని సికార్‌లో వాట్సాప్ నుంచి వచ్చినట్లు గుర్తించారు.
కేరళ ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా..
నీట్ ప్రశ్నపత్రంలో 600 మార్కుల ప్రశ్నలతో ఆ పేపర్ పోలి ఉంది. కొన్ని ప్రశ్నలు ఒకేలా ఉండటం పలు అనుమానాలు మొదలయ్యాయి. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. సదరు వ్యక్తి ఈనెల ఒకటిన సికార్‌లోని తన ఫ్రెండ్‌కి దానికి సంబంధించిన మెటీరియల్ ఇచ్చాడని తెలుస్తోంది. ఆ పేపర్ కాస్తా కోచింగ్ నెట్‌వర్కులు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరింది. అందులో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించి 300లకు ప్రశ్నలు చేతి రాతతో ఉన్నట్లు తెలిసింది. ఆ పేపర్ ఇచ్చినందుకు విద్యార్థుల నుంచి రూ. 20 వేల నుంచి రూ. 2 లక్షల వరకు విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురిని అరెస్టు చేశారు పోలీసులు.

# జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత పంపిణీ


మొదటి తరువాయి

నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా మంగళవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్ కుమార్ రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి డి.శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ పి.మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదని అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2బీహెచ్ కే ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్ధిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధత వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనలో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోని ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్ భూములు, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్ల శిథిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

# మధ్యవర్తిగా పాక్‌ని నమ్మలేం

మొదటి తరువాయి

ట్రంప్ కు సన్నిహితులైన కొందరు ముఖ్య నేతలు అభిప్రాయపడ్డారంటూ మరొక అమెరికన్ మీడియా సంస్థ కథనాన్ని ప్రచురించింది. శాంతి చర్చల స్థితిపై దేశాధ్యక్షుడు ట్రంప్ అసంతృప్తిగా ఉన్నారనే విషయాన్ని ఇరాన్ ను పాకిస్థాన్ తెలియాజేస్తోందా లేదా అనే దానిపై ఇప్పుడు అమెరికా ప్రభుత్వ వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయని తెలిపింది.
ఇరాన్ తరపున సానుకూలంగా పాక్ ప్రజెంటేషన్
ఇరాన్ వైఖరి గురించి అమెరికాకు ఉన్నది ఉన్నట్లుగా చెప్పకుండా, దాన్ని పూర్తి సానుకూల కోణంలో పాకిస్థాన్ ప్రజెంట్ చేస్తోందనే భావనకు ట్రంప్ సర్కారులోని కొందరు అధికారులు వచ్చారని కథనం పేర్కొంది. పాక్ ఈ విధంగా చేస్తున్నందు వల్లే శాంతి చర్చలపై అమెరికా అధికారులు చేస్తున్న ప్రకటనలకు, ఇరాన్ పక్షం తీసుకుంటున్న వైఖరులకు మధ్య తేడాలు ఉంటున్నాయని చెప్పింది. తమ ఎదుట కూడా చైనానే అడ్డున్నట్లు సోమవారం రోజు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెషియాన్ చేసిన ప్రకటన సైతం ఇందుకు సాక్ష్యంగా నిలిచింది. తమ దేశ సైనిక శక్తికి, జాతీయ ప్రయోజనాలకు మద్దతుగా ఉండే చర్యలకే ప్రాధాన్యత ఇస్తామని ఆయన తేల్చి చెప్పడం గమనార్హం. దీనిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ, అమెరికా – ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఇప్పుడు వెండిలేటర్ పై ఉందని ప్రకటించారు. ఇరాన్ గతంలో ఎన్నడూ లేనంత బలహీనంగా ఉందని, ఆ దేశ ప్రతిపాదన చెత్త ముక్కతో సమానమని అది అమోదయోగ్యం కాదని ఆయన స్పష్టం చేశారు.



ఇరాన్ పంపిన చెత్తను పూర్తిగా చదవలేదని, మొత్తం మీద వాళ్లు (ఇరాన్) వెండిలేటర్ పై ఉన్నారని ట్రంప్ హెచ్చరించారు. కాల్పుల విరమణ కాలంలో ఇరాన్ నిర్మించుకున్న కొద్దిపాటి బలన్నైనా అమెరికా ఒక్క రోజులోనే నాశనం చేస్తుందన్నారు.
ఇరాన్ పై మళ్ళీ దాడులకే ట్రంప్ మొగ్గు?
చర్చల వేళ ఇరాన్ ప్రదర్శించిన మొండి వైఖరిపై ప్రెసిడెంట్ ట్రంప్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారంటూ ఓ అమెరికన్ మీడియా సంస్థ కథనాన్ని ప్రచురించింది. ఈ పరిస్థితుల్లో మళ్లీ ఇరాన్ పై వైమానిక దాడులను ప్రారంభించే ప్రతిపాదనను ఆయన పరిశీలించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపింది. ఇప్పటికే హార్ముజ్ జలసంధిని ఇరానే నియంత్రిస్తుండటం పైనా ట్రంప్ అసహనంతో ఉన్నారని పేర్కొంది. ఇరాన్ లోని అతివాద నేతలే శాంతి చర్చలకు అడ్డు తగులుతున్నారనే అభిప్రాయాన్ని అమెరికా ప్రెసిడెంట్ పునరుద్ఘాటించారని కథనంలో ప్రస్తావించారు. ప్రస్తుతం ఇరాన్ వ్యక్తం చేస్తున్న వైఖరిని బట్టి, ఆ దేశానికి చర్చలపై అసలు ఆసక్తి ఉందా అనే ప్రశ్న అమెరికా ప్రభుత్వ వర్గాల్లో ఉదయిస్తోందని తెలిపారు.
ట్రంప్ సర్కారులోనూ విభేదాలు:
అమెరికన్ మీడియా కథనం ప్రకారం, తదుపరి కార్యాచరణ విషయంలో ట్రంప్ సర్కారులోనూ విభేదాలు తలెత్తాయి. తీవ్రమైన సైనిక చర్య ద్వారా ఇరాన్ ను తొలుత బలహీనపరచాలని రక్షణ శాఖలోని పలువురు అధికారులతో పాటు ఇంకొందరు కీలక నేతలు ట్రంప్ కు సూచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్ తో చర్చలను ఇంకొంత కాలం పాటు కొనసాగించడం మంచిదని ఇంకొందరు ముఖ్య నేతలు ట్రంప్ కు సలహా ఇస్తున్నట్లు తెలుస్తోంది. చాలా దశాబ్దాలుగా ఆర్థిక ఆంక్షలను ఎదుర్కొని నిలబడిన ఇరాన్, అమెరికా సర్కారు ఆలోచించినంత అత్యవసరంగా పరిష్కారాన్ని కోరుకునే అవకాశాలు ఉండవని ట్రంప్ సర్కారులోని ఇంకొందరు నేతలు అభిప్రాయపడినట్లు తెలిసింది.

## హనుమాన్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే జయసూర్య ప్రత్యేక పూజలు



**నందికొట్కూరు, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మిడ్తూరు మండలం చెక్కుచెర్ల బాట సమీపంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.అనంతరం భక్తుల సౌకర్యార్థం తాగునీటి కోసం కొత్త బోరు ప్రారంభించారు.కార్యక్రమంలో మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరమ్ ప్రసాద్ రెడ్డి, యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి, సర్వోత్తమ్ రెడ్డి, సుధాకర్ యాదవ్, పల్చని మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రైతుల ఆందోళన

**- ఐటీసీపై మండిపాటు**



**నందికొట్కూరు, మే 12( నీలగిరి ఎక్స్ ప్రెస్):** మిడుతూరు మండలం మాసుపేట గ్రామంలోని ఐటీసీ కంపెనీ గోడౌన్ ముందు పొగాకు రైతులు పురుగుమందు డబ్బాలతో నిరసన చేపట్టారు.రైతులు మాట్లాడుతూ, “మా పొగాకు క్వింటాల్‌కు 16 వేల రూపాయలతో అగ్రిమెంట్ చేసుకున్న కంపెనీ, ఇప్పుడు తీరా 9 వేలకే కొనుగోలు చేస్తామని చెబుతోంది. ఇది రైతులపై తీవ్ర అన్యాయం” అని ఆవేదన వ్యక్తం చేశారు.తమ కష్టార్జిత పంటకు సరైన ధర ఇవ్వాలని, 16 వేల రూపాయలకే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. “రైతుల పట్ల ఈ నిర్లక్ష్యం కొనసాగితే మరింత ఉధృతమైన ఆందోళనలు చేస్తాం” అని హెచ్చరించారు.ఈ నిరసనలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని తమ సమస్యలను బహిరంగంగా వ్యక్తం చేశారు.

## విద్యా వారోత్సవాల్లో పోటీ పరీక్షల అవగాహన, జాబ్ మేళా



**ఆమనగల్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజా పాలన 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న విద్యా వారోత్సవాలు రెండో రోజు కార్యక్రమాలు ఆమనగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగాయి.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి అధ్యక్షతన పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కళాశాలలో జాబ్ మేళా కూడా జరిగింది.ఈ జాబ్ మేళాకు 32 మంది నిరుద్యోగులు హాజరై అవకాశాలను పరిశీలించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయంలో మాజీ జడ్పీ వైస్ చైర్ పర్సన్ ప్రత్యేక పూజలు

**ఎలిగేడు, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హనుమాన్ జయంతి సందర్భంగా ఎలిగేడు మండల కేంద్రంలోని శ్రీ కోదండరామాలయం హనుమాన్ దేవాలయంలో పెద్దపల్లి జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్ పర్సన్ మండిగ రేణుక రాజనర్సయ్య ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, “ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని భగవంతుడిని కోరుకున్నాను. శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయంలో ఆంజనేయ స్వామి దర్శనం పొందడం అదృష్టం” అని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆలయ అర్చకులు గరిమెళ్ళ మురళి, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న జడ్పీ వైస్ చైర్ పర్సన్ మండిగా రేణుక రాజనర్సయ్య

# వేదగిరి కొండపై ఆధ్యాత్మిక వైభవం

**- గురు నిలయానికి భూమి పూజ, గిరిప్రదక్షిణ**



**జిల్లేడు చౌదరిగుడ, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లేడు చౌదరిగుడ మండలంలోని వేదగిరి పుణ్యక్షేత్రం హనుమాన్ జయంతి వేడుకలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వేద పీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ మర్రి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని, నూతనంగా నిర్మించనున్న గురు నిలయానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం వేదాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిపి, భారీ గిరిప్రదక్షిణ ప్రారంభమైంది.ఎమ్మెల్యే మాట్లాడుతూ, “వేదగిరి ఒకప్పుడు సకల దేవతల నిలయంగా వెలుగొందింది. నేడు మళ్ళీ పూర్వవైభవాన్ని సంతరించుకోవడం అభినందనీయమైంది. వేదగిరిని ఆధ్యాత్మిక--పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నా వంతు సహకారం ఉంటుంది” అని పేర్కొన్నారు.ఉదయం చౌడమ్మ గుట్ట ఆంజనేయ ఆలయం నుండి వేదగిరి వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తులతో కలిసి గిరిప్రదక్షిణ జరిగింది. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన అంబాత్రేయ పీఠాధిపతి శ్రీ ఆదిత్య పరాస్వామి భక్తులకు ఆశీర్వచనాలు అందిస్తూ, “ఆధ్యాత్మిక మార్గమే జీవిత ఉన్నతికి పునాది” అని ప్రసంగించారు.సుమారు 6000 మంది భక్తులకు యువ కాంగ్రెస్ నాయకుడు కేకే కృష్ణ స్వచ్ఛందంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పకడ్బందీ ఏర్పాట్లు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించినందుకు ఆయనకు ఎమ్మెల్యే, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వేద పీఠం సభ్యులు, వివిధ పార్టీల ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అందరికీ సమానమైన నాణ్యమైన విద్య అందించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ పోరుబాట

**హైదరాబాద్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణలో విద్యకు ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని ప్రకటించలేదని, విద్యా కమిషన్ కార్పొరేటీకరణ ఆలోచనా విధానంతో రిపోర్టులు ఇచ్చిందని, అందులో మానవీయ విలువలు లోపించాయని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ హరగోపాల్ విమర్శించారు.టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యాలయం ఆబిడ్స్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, “యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు ప్రస్తుత విద్యా విధానానికి ప్రత్యామ్నాయం కాదు. ఒక్కో స్కూల్‌కు 25 ఎకరాలలో 200 కోట్లతో నిర్మాణం, 3500 కోట్ల బడ్జెట్ కేటాయింపు కాంట్రాక్టర్ల లాభాల కోసమే. ఈ విధానం ప్రభుత్వ పాఠశాలలను బలహీనపరుస్తుంది. పేద పిల్లలకు ఒరిగేది ఏమీ లేదు” అని అన్నారు.ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి పిల్లవాడికి ఒకే



రకమైన నాణ్యమైన విద్య అందించాల్సిన అవసరం ఉందని, విద్యా కమిషన్ సూచించినట్లు బడ్జెట్‌లో కనీసం 18 శాతం విద్యకు కేటాయించాలి అని ఆయన డిమాండ్ చేశారు.అదేవిధంగా, జాతీయ స్థాయి టెస్టింగ్ ఏజెన్సీల వైఫల్యం వల్ల కోట్లాది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టివేయబడిందని, నీట్ పేపర్ లీకేజీ వంటి ఘటనలపై త్వరితగతిన కఠిన చర్యలు తీసుకోవాలని సమావేశం కోరింది.ఈ సమావేశంలో విద్యా పరిరక్షణ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొ. లక్ష్మీనారాయణ, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, డీటీఎఫ్ నాయకులు సోమయ్య, టి. లింగారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు వై. అశోక్ కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి యం. రఘుశంకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కె. వేణుగోపాల్, కార్యదర్శి రవిచంద్ర, విద్యార్థి సంఘాల నాయకులు అనిల్, నాగరాజు, యం. ప్రకాశ్ రావు, యం. రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

## బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

**- గోలి శ్రీనివాస్ రెడ్డి**

**వెల్దండ, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పత్రికా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను వెంటనే అరెస్టు చేసి, పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలి. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలి” అని డిమాండ్ చేశారు.“అధికార అండదండలతోనే ఇలాంటి ఘటనలు



జరుగుతున్నాయి. మహిళలు, బాలికల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడకూడదు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులందరినీ చట్టం ముందు నిలబెట్టాలి” అని ఆయన స్పష్టం చేశారు.అదేవిధంగా, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ను మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని ఆయన కోరారు. “కుటుంబ సభ్యుల ప్రవర్తన వల్ల ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. మహిళల భద్రతపై ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది” అని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి పోలీస్ స్టేషన్‌లో మహిళా ఫిర్యాదులపై వేగంగా స్పందించే ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలని, సమాజంలో మహిళల పట్ల గౌరవం పెంచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీటీసీ లింగం, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య, చంద్రమోహన్ రెడ్డి, జిల్లా నాయకులు నాగులు నాయక్, కొండల్ యాదవ్, గణేష్, జంగిలి ఆనంద్, జంగిలి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


## హత్య కేసు ఛేధించిన పోలీసులు

**షాద్‌నగర్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసును పోలీసులు కేవలం 48 గంటల్లోనే ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.మహబూబ్‌నగర్ జిల్లా పోమాల్ గ్రామానికి చెందిన పల్లె కేశవులు (39), షాద్‌నగర్‌లో కూలీగా పని చేస్తూ కుటుంబంతో నివసిస్తున్నాడు. మే 9న భూమి వివాదం కోసం రూ.50 వేల అప్పు తీసుకుని పరిగి వెళ్లి తిరిగి వచ్చాడు. అదే రాత్రి బస్టాండ్ సమీపంలోని వైన్ షాప్ వద్ద మద్యం సేవిస్తున్న సమయంలో నిందితుడు పుల్లగోయి బజరన్న అతనితో పరిచయం ఏర్పరుచుకున్నాడు. కేశవుల వద్ద నగదు ఉన్న విషయం గమనించి, బజరన్న తన సహచరురాలు బైన్ల యాదమ్మతో కలిసి కేశవులను వా== వెంచర్ ప్రాంతానికి తీసుకెళ్లి దాడి చేసి హత్య చేశాడు.పోలీసులు సాంకేతిక ఆధారాలతో విచారణ జరిపి మే 12న ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.3,900 నగదు, హోండా షైన్ బైక్, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.ఈ కేసు ఛేదనలో కమిషనర్ తరుణ్ జోషి, డీసీపీ సీహెచ్. శిరీష, ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. సీతారాం నేతృత్వంలోని ప్రత్యేక బృందం కీలక పాత్ర పోషించింది. కేసు ఛేదనలో పాల్గొన్న పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.




## రైలు ప్రయాణం తక్కువ చార్జీ, సురక్షిత ప్రయాణం

**- ఎంపీ బైరెడ్డి శబరి**



**నంద్యాల, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి మంగళవారం నంద్యాల రైల్వే స్టేషన్‌లో గుంతకల్లు--మార్కాపురం పగటిపూట ప్యాసింజర్ రైలును జెండా ఊపి ప్రారంభించారు.ఆమె మాట్లాడుతూ, “నంద్యాల జిల్లా ప్రజల చిరకాలిక స్వప్నం నేడు నెరవేరింది. తక్కువ చార్జీ, సురక్షిత ప్రయాణం, ఆధునిక వసతులు కల్పించడమే మా లక్ష్యం. ప్రజల వినతిని పార్లమెంట్‌లో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆమోదం లభించింది” అని తెలిపారు.నంద్యాల మీదుగా అజ్మీర్, శబరి మల, కడప ఇస్తేమాలకు ప్రత్యేక రైళ్లు నడిపించామని, మరిన్ని రెగ్యులర్ రైళ్లు కూడా నడిపేలా కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.కేంద్ర ప్రభుత్వం రూ.24 కోట్లతో నంద్యాల రైల్వే స్టేషన్ ఆధునికరణ పనులు చేపడుతోందని, కొత్తగా గూడ్స్ స్టేషన్ మంజూరు అయిందని, పిట్ లైన్ కూడా మంజూరు చేయాలని కోరామని ఎంపీ తెలిపారు.ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డీఆర్ఎం సుధేష్టసేన్, జడ్ ఆర్ సి సి సభ్యులు నారాయణ రెడ్డి, వెంకట రంగయ్య, జిన్ను ప్రసాద్ రెడ్డి, నాగేశ్వరరావు, అమీర్ బాషా, జుబేర్ బాషా, సీనియర్ అధికారులు డాక్టర్ ప్రదీప్, క్యాప్టెన్ ఆరోరా తదితరులు పాల్గొన్నారు.



## మైనంపల్లి గ్రామంలో
# నర్సుల దినోత్సవం



**దేవరకొండ మే 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ కొర్ర రాంసింగ్ ఆధ్వర్యంలో ప్రపంచ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామంలో పనిచేస్తున్న నర్సులకు ఏఎన్ఎం లకు ఆశా కార్యకర్తలను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాసారం అంబేద్కర్.ఏ ఎన్ ఎం లు విజయ, విద్యావతి, ఆశా కార్యకర్త అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ గురుకులాల్లో
# సీఈసీ గ్రూపు పునరుద్ధరణ

ఆర్. కృష్ణయ్యకు పాలాభిషేకం



**దేవరకొండ, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమంలో బీసీ గురుకులాల్లో తొలగించిన సీఈసీ గ్రూపును యథాస్థానంలోకి తీసుకువచ్చినందుకు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యకు పాలాభిషేకం చేశారు.గురుకుల సెక్రటరీ సైదులు తొలగించిన గ్రూపులను తిరిగి పునరుద్ధరించేందుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేయగా, ఆర్. కృష్ణయ్య జోక్యం చేసుకుని అన్ని బీసీ గురుకులాల్లో గ్రూపులను యథాస్థానంలోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, "పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆర్. కృష్ణయ్య చేసిన సేవలు విశేషం. ఆయనకు కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, చేరుపెల్లి జయలక్ష్మి, ఎండి రంజాన్ బేగ్, చిలువేరు ముత్తమ్మ, బీమగోని శివ గౌడ్, పెరికేటి శ్రీనివాస్ చారి, లైబ్రరీ శారద, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచారంల ప్రైవేటు పాఠశాలల ప్రచారం

-నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి.
-బిఆర్ఎస్వి దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ.



**దేవరకొండ మే 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
ఎన్నికల ప్రచారం ల ప్రైవేటు పాఠశాలలు ప్రచారం నిర్వహిస్తున్నారని బిఆర్ఎస్వి దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూప్రవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ప్రచారం నిర్వహిస్తున్న నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు.నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి అని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో బిఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని అయన హేచ్చరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్వీ మండల అధ్యక్షులు పాత్లవత్ లక్ష్మణ్, కౌన్సిలర్ పొట్ట మధు, జమీర్ బాబా,అభి,తదితరులు పాల్గొన్నారు.

## నీటి వినియోగం పై అవగాహన సదస్సు




**దేవరకొండ మే 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామంలో జల్ సంచాయి - జన్ భాగీదారి.జల శక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగాగ్రామంలో ప్రజలకు నీటివినియోగం.నీటి సంరక్షణకు చేపట్టవలసిన పనుల గురించి స్థానిక సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో ఉపాధి హామీ అధికారులు జహీర్ , అమరెందర్ ,వార్డు సభ్యులు కొర్ర లక్ష్మీ ప్రశాంత్, కొర్ర సునీత బద్దు,కొర్ర కిషన్ నాయక్ ,పులిజాల సంతోష వెంకట్ ,పులిజలా నాగరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు


## ముప్పిరితోట ఆలయంలో
# వైభవంగా కుంకుమపూజ



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



దివ్యా పునః ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పీఠాధిపతులు.



**ఎలిగేడు, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని ముప్పిరితోట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో జరుగుతున్న భక్తాంజనేయస్వామి దివ్య పునఃప్రతిష్టాపన మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళలతో కుంకుమపూజ అత్యంత వైభవంగా జరిగింది.తోగుట--రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి ఆచార్యత్వంలో ఉదయం నుంచి శాంతిపాఠం, ఆవాహిత దేవతా పూజ, మహాస్నపనం, మూలమంత్ర హవనం, కుంకుమపూజలు నిర్వహించారు. సాయంత్రం ధ్యాన, పుష్ప, శయ్యాధివాస, ప్రదోషకాల పూజ, రాజోపచారాలు, తీర్థప్రసాద వితరణతో కార్యక్రమం మరింత శోభాయమానంగా సాగింది.బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయని ఆలయ కమిటీ ప్రకటించింది. గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## ఆంజనేయుడి ఆశీస్సులు
# అందరికీ ఉండాలి

- కౌన్సిలర్ పాపిశెట్టి రాము



**ఆమనగల్లు, మే 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆంజనేయ స్వామి ఆశీస్సులు కల్వకుర్తి నియోజకవర్గం ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలపై నిండుగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము ఆ స్వామి వారిని ప్రార్థించారు. కడ్తాల్ మండల పరిధిలోని అన్మాస్ పల్లి గ్రామంలో ఉన్న వీరాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలకు పాపిశెట్టి రాము హాజరై ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకులు కొర్పోలు లీల లక్ష్మారెడ్డి, నిర్వాహకులు డీసీసీబీ డైరెక్టర్, సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మురళీకృష్ణ, అమనగల్లు మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ ఎనుమల్ల రమేష్, సింగల్ విండో సీఈవో పద్మాకర్ రెడ్డి, నాయకులు శ్రీను నాయక్, కొమ్ము ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అమృతం వీర ఎన్నిక పట్ల హర్షం




**కల్వకుర్తి, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా అమృతం వీర ఎన్నిక కావడంతో పలువురు నాయకులు, సామాజిక కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అయిల్ శ్రీశైలం గౌడ్ శాలువాతో ఘన సన్మానం చేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ సెక్రటరీ చంద్రయ్య, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షఫీ బాబా తదితరులు పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ, "రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై కౌన్సిల్ సమర్థవంతంగా పనిచేయాలి. ముఖ్యంగా బీసీ, ఎస్సీ ఎస్టీ వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలి" అని విజ్ఞప్తి చేశారు.అమృతం వీర మాట్లాడుతూ, "మానవ హక్కుల పరిరక్షణే మా ప్రధాన బాధ్యత. అణగారిన వర్గాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తాను. ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ బాధితులకు అండగా నిలుస్తాను. రాష్ట్రవ్యాప్తంగా సంస్థను బలోపేతం చేసి ప్రజలకు న్యాయం జరిగేలా కట్టుబడి పనిచేస్తాను" అని పేర్కొన్నారు.

## ఈనెల 17న పెద్దపల్లిలో వేముల రమణయ్య స్మారక చదరంగం పోటీలు



**ఎలిగేడు, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈనెల 17న ఆదివారం పెద్దపల్లి అమర్చంద్ కళ్యాణమండపంలో వేముల రమణయ్య స్మారక ఉమ్మడి కరీంనగర్ జిల్లా చదరంగం పోటీలు జరుగనున్నాయి.జిల్లా చదరంగం సమైక్య అధ్యక్ష--కార్యదర్శులు గడ్డాల శ్రీనివాస్, బజ్జూరి ప్రసాద్ తెలిపారు. పాల్గొనదలచిన వారు అదే రోజు ఉదయం 9 గంటలకు ?200 ఎంట్రీ ఫీజుతో పేరు నమోదు చేసుకోవాలని కోరారు.గెలుపొందిన 8 మందికి నగదు బహుమతులు అందజేయబడతాయి. అదనంగా అండర్ 9, 11, 15 విభాగాల క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు ఉంటాయి. పాల్గొనేవారికి ఉచిత భోజన సౌకర్యం కల్పించబడుతుంది.క్రీడాకారులు తమ చెస్ బోర్డులు, పావులు వెంట తెచ్చుకోవాలి. వివరాలకు 9515342207 సంప్రదించవచ్చు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**ఉప్పల్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హనుమాన్ జయంతి సందర్భంగా బీరప్ప గడ్డ మండే మార్కెట్‌లోని హనుమాన్ దేవాలయం, అలాగే ఎన్జీఆర్ఐ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ, "హనుమాన్ మాల ధరించిన భక్తులు దీక్షను విరమించే ఈ పర్వదినాన, ఆంజనేయ స్వామి ఆశీస్సులు వారిపై ఉండి, వారి కోరికలు నెరవేరాలని ప్రార్థిస్తున్నాను" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, మొత్తం శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణ గౌడ్, శ్యామ్, బంటి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పోతేపల్లి పోస్టుమాస్టర్‌పై సర్పంచ్ ఫిర్యాదు



**వెల్దండ, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పోతేపల్లి గ్రామ పోస్టుమాస్టర్ వావిళ్ళ కిరణ్ కుమార్ యాదవ్పై గ్రామ సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్ ఫిర్యాదు చేశారు.సర్పంచ్ ఆరోపణల ప్రకారం, పోస్టుమాస్టర్ నిబంధనలు అతిక్రమించి పోస్టాఫీస్‌కు వచ్చిన లేఖలను ముందుగానే తెరిచి చూస్తున్నారని, సకాలంలో ఉత్తరాలు అందించకుండా జాప్యం చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని పేర్కొన్నారు.ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాలకు ఉత్తరాలు ఆలస్యంగా చేరుతున్నాయని, అధికారులు స్పందించకుంటే వనపర్తి డివిజన్ పోస్టాఫీస్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండల్ యాదవ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ధాన్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి -- కలెక్టర్




**నల్లగొండ, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలో ఇప్పటివరకు 4 లక్షల 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయిందని కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.రైస్ మిల్లర్లు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని దించుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన ఆదేశించారు. "ప్రైవేటు ధాన్యానికి ప్రాధాన్యత ఇస్తే కఠిన చర్యలు తప్పవు. రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సహించం" అని హెచ్చరించారు.రబీ ధాన్యం సేకరణలో భాగంగా మిల్లుల వద్ద లారీల అన్లోడింగ్ జాప్యం జరుగుతున్న నేపథ్యంలో, కలెక్టర్ బి. చంద్రశేఖర్ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్తో కలిసి మిర్యాలగూడలోని వాగ్దేవి రైస్ మిల్, మహేశ్వరి పారా బాయిల్డ్ రైస్ మిల్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

# చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యం

- మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి



**ఆమనగల్లు, మే 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆమనగల్లు ప్రభుత్వ కళాశాలలో ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలు రెండవ రోజు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి కమిషనర్ హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రవేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలు, డిగ్రీ కళాశాలలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదువుకుంటే ఏదైనా సాధించవచ్చున్నారు. చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలన్నారు. వ్యక్తిత్వ వికాసంపై దృష్టి పెట్టాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి మరియు కళాశాల అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మతల్లి చల్లని చూపు అందరిపై ఉండాలి..

- మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి
- కడ్తాల్‌లో వైభవంగా రేణుకా ఎల్లమ్మ కళ్యాణోత్సవం
- ఉత్సవ నిర్వాహకులకు 15,000/- విరాళం అందించిన ఎల్ఎన్ రెడ్డి



**ఆమనగల్లు, మే 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రేణుకా ఎల్లమ్మ తల్లి చల్లని చూపు అందరిపై ఉండాలని మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. ఆధ్యాత్మిక చింతన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని, దైవ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ఆయన కోరారు. మంగళవారం కడ్తాల్ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవానికి హాజరై, దేవాలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేణుకా ఎల్లమ్మతల్లి దయతో ప్రజలంతా సుఖఃసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు ఆలయ అభివృద్ధికి, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులకు విరాళంగా 15,000/- అందజేశారు అదేవిధంగా దేవాలయ అభివృద్ధికి సహకరిస్తున్న గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గురిగళ్ళ లక్ష్మయ్య, మంగళపల్లి నర్సింహా, గురిగళ్ళ చంద్రయ్య, గూడెపు జంగయ్య, సిద్ది గారి జంగయ్య, కాలె రమేష్, మాదారం మహేష్ గౌడ్, శేఖర్ యాదవ్, అంజయ్య, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు పారదర్శకంగా జరుగుతున్నాయి

- మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా



**ఆమనగల్లు, మే 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు పారదర్శకంగా జరుగుతోందని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా తెలిపారు. ఆమనగల్లు పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి ఇప్పటికే పెద్ద మొత్తంలో ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారులకు లేదా తనకు నేరుగా తెలియచేయాలని సూచించారు.

# అంతిరింతుర కొండపై హనుమజ్జయంతి వేడుకలు



**ఆమనగల్లు, మే 12 నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని అంతిరింతుర కొండపై మంగళవారం హనుమజ్జయంతి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వామివారికి పంచామృతాలతో విశేష అభిషేకాలు చేసి, సింధూరంతో సుందరంగా అలంకరించారు. హనుమాన్ చాలీసా పారాయణంతో మార్మోగిన ఆలయం భక్తులు తమలపాకుల దండలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

# 'జై శ్రీరామ్' నామస్మరణతో మార్మోగిన అన్మాస్ పల్లి





- హనుమాన్ జయంతి సందర్భంగా అన్నదానం, పూజలు, అభిషేకాలు
- పూజల్లో పాల్గొన్న డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా

**ఆమనగల్లు, మే 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కడ్తాల్ మండల పరిధిలోని అన్మాస్ పల్లి గ్రామంలో ఉన్న వీరాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో హనుమాన్ విగ్రహానికి ఆరాధనతో పాటు హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకులు కొర్పోలు లీల లక్ష్మారెడ్డి, నిర్వాహకులు డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మురళీకృష్ణ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ భక్త బృందం చేత భక్తిశ్రద్ధలతో పారాయణాలు నిర్వహించారు. అన్మాస్ పల్లి గ్రామము 'జై శ్రీరామ్' హనుమాన్ నామస్మరణతో మారుమోగింది. అనంతరం హనుమాన్ జయంతికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు లక్ష్మీనరసింహారెడ్డి, సర్పంచులు శ్రీను నాయక్, నర్సింహా గౌడ్, ఉప సర్పంచ్ మహేష్, అమనగల్లు మున్సిపాలిటీ కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, ఎనుముల రమేష్, సింగల్ విండో సీఈవో పద్మాకర్ రెడ్డి, డైరెక్టర్లు జోగు వీరయ్య, చెగురి వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బిచ్య నాయక్, మాజీ కోఆప్షన్ సభ్యులు జహంగీర్ బాబా, నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు జహంగీర్ అలీ, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, అమృతం పాండు, పి రామకృష్ణ, కొమ్ము ప్రసాద్, ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు గంప రాములు, ప్రధాన కార్యదర్శి బి రామకృష్ణ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు వీరేంద్ర, భజన మండలి అధ్యక్షుడు వెంకటరెడ్డి, భజన మండలి సభ్యులు సాయికుమార్, సుధాకర్, అల్లాజీ, సత్యం, శ్రీరాములు, శ్రీను, రాజు, కేశవులు, కృష్ణయ్య, పర్వతాలు, శంకర్, మణిక్ రెడ్డి, చెర్రీ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన కౌన్సిలర్ పాపిశెట్టి రాము



**ఆమనగల్లు, మే 12 నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన కొప్పు యాదమ్మ, వెల్దండ మండలం చౌదర్ పల్లి గ్రామానికి చెందిన దువ్వాసి జంగమ్మ, దొబ్బల బాలమ్మ లు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము మంగళవారం మృతుల పార్థివ దేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. తనవంతు సహాయంగా విడివిడిగా ఆయా కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. అధైర్య పడకండి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట శ్రీను నాయక్ ఉన్నారు.

# మార్కెట్ యార్డులో పందుల బెడదను నివారించండి



**ఆమనగల్లు, మే 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పందుల బెడదను నివారించాలని మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, ఎస్ఐ సీతారాం రెడ్డి లకు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తాళ్ళ రవీందర్, జెల్ల రమేష్ గౌడ్ వినతి పత్రం అందజేశారు. పందుల బెడదతో కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన ధాన్యానికి నష్టం వాటిల్లుతున్నట్లు వివరించారు. రైతుల ఇబ్బందుల దృష్ట్యా చర్యలు తీసుకొని పందుల బెడదను నివారించాలని వారు వినతి పత్రాలలో కోరారు.

# కాంగ్రెస్ గూటికి చేరనున్న సర్పంచ్



**ఆమనగల్లు, మే 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామ సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి రేపు (గురువారం) కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. సుమారు 400మందితో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు, గ్రామ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు, రాబోయే రోజుల్లో మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

# నర్సుల సేవలు అమూల్యం

- సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు



**ఆమనగల్లు, మే 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మానవాళికి అంకిత భావంతో సేవలందిస్తూ, తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజల ఆరోగ్య రక్షణలో నిరంతరం సేవలందిస్తున్న నర్సులందరికీ ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు మంగళవారం పట్టణ కేంద్రంలోని కమ్యూనిటి హెల్త్ సెంటర్లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి నర్సులను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. రోగుల సేవలో నర్సుల పాత్ర అమూల్యమని, ఆరోగ్య వ్యవస్థకు వారు వెన్నుముకలాంటివారని ఆయన పేర్కొన్నారు. వారి సేవలను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ విజయలక్ష్మి, హెడ్ నర్స్ ఎసుమని, రత్నజ్యోతి, హేక్సీబా, సునీత, అలివేలు, సాయి లత, కృష్ణ లీల, సంపూర్ణ, రేణుక, మధు, సత్య, మునీరా, పూజ ల్యాబ్ టెక్నీషియన్ వేణు, జూనియర్ అసిస్టెంట్ సాయి, వైద్య సిబ్బంది గుజ్జరి శీను, కలమ్మ, సురేష్, ఆనంద్, పవన్, మంగ, శారద, శాంతి, సుశీల, అంజమ్మ, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలతో ఉన్నత శిఖరాలకు..

## రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**ఆమనగల్లు, మే 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** విద్యార్థులు మంచిగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించగలుగుతారని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వెల్దండ మండలంలో జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షల్లో 73, 74 శాతం ఉత్తీర్ణత సాధించిన కొమ్ము నాగయ్య కుమార్తె హన్సిక మరియు దాసరి లింగం కుమార్తె అఖిల లను వారి ప్రతిభను అభినందిస్తూ మంగళవారం గోలీ శ్రీనివాస్ రెడ్డి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి ప్రోత్సాహకంగా ఒక్కొక్కరికి రూ. 8,000 రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కష్టపడి చదివి జాతీయ స్థాయి పరీక్షల్లో విజయం సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి చేరుకుని రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగులు నాయక్, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, మాజీ సర్పంచ్ ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ లింగం, శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, సీనియర్ నాయకులు జోగాయ్య, మాజీ సర్పంచ్ కృష్ణ రెడ్డి, చుక్కాపూర్ సర్పంచ్ వీరేషం, సురేందర్ రెడ్డి, వార్డు సభ్యులు దేవేందర్, ఆనంద్, మాజీ ఉప సర్పంచ్ నర్సింహా, శేఖర్, ఉప సర్పంచ్ కొండల్ యాదవ్ నాయకులు ప్రవీణ్, శ్రీను, గణేష్ తదితరులు ఉన్నారు.

# సోలార్ వినియోగంపై అవగాహన సదస్సు

**మానకొండూర్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా ఆర్థికంగా ప్రయోజనం పొందాలని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజలను కోరారు. మంగళవారం పచ్చునూరు గ్రామంలో టీఎస్ఆర్ఈడీసీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా గృహ వినియోగదారులు తమ ఇంటి డాబాలపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకొని ప్రతి నెలా 360 యూనిట్ల వరకు పొందవచ్చని, మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇచ్చి అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రజలు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.అదే రోజు పచ్చునూరులో వీవో భవన నిర్మాణానికి భూమి




పూజ చేశారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు ఈ భవనం ఉపయోగపడుతుందని, గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో టీఎస్ఆర్ఈడీసీఓ అధికారులు, మండల తహసిల్దార్ వివి వరలక్ష్మి, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, పార్టీ నాయకులు రొంటాల లక్ష్మారెడ్డి, కనకం అశోక్, రేమిడి శ్రీనివాసరెడ్డి, ముద్దసాని శ్రీనివాసరెడ్డి, తాళ్లపల్లి సంపత్ గౌడ్, బండి మల్లేష్, రేమిడి తిరుపతి, సాయిరి దేవయ్య, కోంట్ర సురేష్, కనకం కుమార్, బుర్ర శ్రీధర్, వేగోళం శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.సోలార్ వినియోగం ద్వారా విద్యుత్ ఖర్చు తగ్గించుకోవాలని, గ్రామాభివృద్ధి కోసం వీవో భవనాలు కీలకమని ఎమ్మెల్యే సత్యనారాయణ స్పష్టం చేశారు.

# బండి సంజయ్ తక్షణమే మంత్రి పదవి నుండి తప్పుకోవాలని సిపిఐ డిమాండ్

**కరీంనగర్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తనయుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసును నీరుగార్చేందుకు మంత్రి హోదాను అడ్డం పెట్టుకొని కుట్ర పన్నుతున్నారని ఆరోపిస్తూ, ఆయనను తక్షణమే మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.నాలుగు రోజుల క్రితం కేసు నమోదైనప్పటికీ ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం దారుణమని ఆయన పేర్కొన్నారు. కేసు నమోదు అనంతరం బాధితురాలి వివరాలు, ఫోటోలు బహిర్గతం కావడం దుర్మార్గమని, దీనికి సంజయ్ సహకారం ఉందని ప్రశ్నించారు.బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఈ ఘటన పార్టీకి సంబంధం లేదని చెప్పడం



అవివేకమని విమర్శించారు. అదే సమయంలో బిజెపి శ్రేణులు సోషల్ మీడియాలో అమ్మాయి ఫోటోలను మార్ఫింగ్ చేస్తూ, ఆమెను కించపరిచే విధంగా పోస్టులు పెడుతున్నారని ఆరోపించారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభక్క పేరుతో ఉన్న గ్రూప్‌లో కూడా ఇలాంటి పోస్టులు పెట్టారని ఉదాహరణగా చూపించారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ అకౌంట్లను పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.బండి సంజయ్‌ను మంత్రి పదవి నుండి తొలగించి బిజెపి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సిపిఐ స్పష్టం చేసింది.

## హనుమాన్ జయంతి సందర్భంగా హిందూ ఏక్తా యాత్రకు పటిష్ట బందోబస్తు




**కరీంనగర్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం కరీంనగర్ నగరంలో జరగనున్న హిందూ ఏక్తా యాత్ర ర్యాలీ కోసం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీసు కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు.ర్యాలీ విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులకు ఆయన ప్రత్యేకంగా బ్రీఫింగ్ నిర్వహించారు. సుమారు 400 మంది పోలీసులు బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారని, సున్నితమైన ప్రాంతాల్లో స్టాటిక్ ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, రూఫ్‌టాప్ నిఘా, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు వంటి విభిన్న విధులను కేటాయించినట్లు వివరించారు.ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చోట్ల దారి మళ్లింపు చర్యలు చేపట్టామని, యాత్ర శోభాయాత్రకు సంబంధించి పోలీసు శాఖ తరపున అన్ని భద్రతా చర్యలు సిద్ధం చేసినట్లు కమిషనర్ గౌష్ ఆలం స్పష్టం చేశారు.హనుమాన్ జయంతి సందర్భంగా కరీంనగర్ నగరం హిందూ ఏక్తా యాత్రతో కాషాయమయం కానుంది.

## ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు

**కరీంనగర్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించబడ్డాయి.కొత్తపల్లిలోని అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో హనుమాన్ దేవాలయంలో అష్టోత్తర కార్యక్రమం, అభిషేకాలు, హోమం, భజనలు, సంకీర్తనలు నిర్వహించగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, విన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.కరీంనగర్ కోతిరాంపూర్ శివాంజనేయ దేవాలయంలో ఆదర్శ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలు, మిత్రులు,



శ్రేయోభిలాషులకు కార్పొరేటర్ మాసం గణేష్ ధన్యవాదాలు తెలిపారు.గంగాధర మండల రంగారావుపల్లిలో హనుమాన్ దేవాలయానికి ప్రత్యేక అలంకరణ చేసి పాలాభిషేకం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం, ఉత్సవ విగ్రహ ఊరేగింపు జరగగా గ్రామ సర్పంచి దాసరి శంకరయ్య, ఉపసర్పంచ్ దేవబహదూర్ రెడ్డి, గుడి చైర్మన్ సుద్దాల సత్యనారాయణ రెడ్డి, కనపర్తి తిరుపతాచారి, గంగాధర మల్లయ్యతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.హుస్నాబాద్ నుండి బీజేపీ నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి నాయకత్వంలో కార్యకర్తలతో కలిసి కరీంనగర్‌లో నిర్వహించిన హిందూ ఏక్తా యాత్రలో పాల్గొనడానికి బయలుదేరారు.జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు భక్తి, ఉత్సాహాలతో సాగి, అన్నదానాలు, ఊరేగింపులు, భజనలతో కరీంనగర్ ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది.

## బండి సంజయ్‌కు పొన్నం అనిల్ సవాల్



**కరీంనగర్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, మహాశక్తి ఆలయంలో అమ్మవారి సాక్షిగా తన కుమారుడు మైనర్ బాలికతో ఎలాంటి సంబంధం లేదని బండి సంజయ్ ప్రమాణం చేయగలడా అని సవాల్ విసిరారు.కరీంనగర్ తెలంగాణ చౌక్ వద్ద బారసా శ్రేణులతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరత్‌ను పోక్సో కేసులో వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సంజయ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మోడీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మౌనంగా ఉన్నారని ఆరోపిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.అనిల్ మాట్లాడుతూ మైనర్ బాలిక విషయంలో ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని, బండి సంజయ్ నిజాయితీ నిరూపించుకోవాలంటే కేంద్ర మంత్రి పదవి, ఎంపీ పదవికి రాజీనామా చేయాలని అన్నారు. బండి సాయి భగీరత్‌ను వెంటనే అరెస్ట్ చేయకపోతే మైనర్ బాలికకు న్యాయం జరిగేంతవరకు బారసా పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మీర్ షౌకత్ అలీ, నారదాసు వసంత రావు, బొంకూరి మోహన్, అన్వేష్, రవి నాయక్, సైఫ్, నయీం, సతీష్, దినేష్, రవి గౌడ్, గోడిషాల పావని గౌడ్, బత్తిని కీర్తి లతా గౌడ్, రుద్ర రాధ, అజంతా, హిమబిందు, శ్రీలత, రాజమణి, రేణుక, అరుణతో పాటు పలువురు బారసా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.బండి సంజయ్ నిజాయితీ నిరూపించుకోవాలంటే ప్రజల ముందు ప్రమాణం చేయాలని పొన్నం అనిల్ సవాల్ విసిరారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

**జగిత్యాల,మే12(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామివారిని కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ మంగళవారం ప్రత్యేక దర్శనం చేసుకున్నారు.ఈ సందర్భంగా వారు శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.అనంతరం శ్రీశైలం గౌడ్ తనయుడు



కూన కృష్ణ గౌడ్ హనుమాన్ మాలవిరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జడ్.పి.హెచ్.ఎస్లో దివ్యాంగుల శిక్షణ పాఠశాల ప్రారంభం



**రామడుగు, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రామడుగు మండలంలోని జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ ఆవరణలో భవిత సెంటర్ దివ్యాంగుల శిక్షణ పాఠశాల భవనం మరియు పిల్లల టాయిలెట్లను గ్రామ సర్పంచ్ మహమ్మద్ మొహీజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రంగనాథ శర్మ, డీఈ కృష్ణ కుమార్, ఏఈ ముకుందం, భవిత సెంటర్ టీచర్ తిరుమల, జడ్.పి.హెచ్.ఎస్ ప్రధానోపాధ్యాయులు పద్మజ, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం రత్నాకర్ రెడ్డి, విన్నర్ స్కూల్ కరస్పాండెంట్ పంజాల జగన్మోహన్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు మామిడి దిలీప్ కుమార్, ఎండి అరీఫ్, కర్నె శ్రీలత--శ్రీనివాస్, రాగం స్వప్న--రవి, చంద అనిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.సర్పంచ్ మహమ్మద్ మొహీజ్ మాట్లాడుతూ రామడుగు గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తానని, పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.దివ్యాంగుల శిక్షణ పాఠశాల ప్రారంభంతో రామడుగులో విద్యా సదుపాయాలు మరింత విస్తరించాయి.

## తెలంగాణ మోడల్ స్కూల్‌లో వంటశాల నిర్మాణ భూమి పూజకి శ్రీకారం



**రామడుగు, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో వంటశాల గది నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. భూమి పూజ అనంతరం పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రామడుగు గ్రామ సర్పంచ్ మహమ్మద్ మొహీజ్, పాలకవర్గం వార్డు సభ్యులు, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు. విద్యార్థుల అభివృద్ధి కోసం మోడల్ స్కూల్‌లో వంటశాల గది నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

## మహిళా డిగ్రీ కళాశాలలో ఉచిత పీజీ శిక్షణ ప్రారంభం




**కరీంనగర్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం ఉచిత పీజీ ప్రవేశ పరీక్షల శిక్షణ ప్రారంభమైంది. ఆర్ట్స్, కామర్స్, సైన్స్ విభాగాల విద్యార్థులకు నిష్ణాతులైన అధ్యాపకులచే బోధన అందించబడుతోంది.ఈ సందర్భంగా విద్యార్థుల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందించేందుకు యోగా మరియు ధ్యాన శిక్షణ కూడా ప్రారంభమైంది. రిటైర్డ్ పిడి జితేంద్ర రావు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణారెడ్డి (హార్ట్ఫుల్నెస్ ట్రైనర్), డి. ప్రియాంక (యోగా టీచర్) శిక్షణ అందిస్తున్నారు.కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అప్సరి ఉస్మాని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కమిటీ కోఆర్డినేటర్ పి. స్వరూప, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఉచిత పీజీ శిక్షణతో విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు మరింత విస్తరించనున్నాయి.

## కలెక్టర్ చిత్రా మిశ్రా సమక్షంలో రక్తసంబంధీకుల నుండి చట్టబద్ధ దత్తత




**కరీంనగర్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మంగళవారం పిల్లలు లేని దంపతులకు రక్తసంబంధీకుల నుండి చట్టపరమైన దత్తత ఉత్తర్వులను అందజేశారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ--మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో చొప్పదండి ప్రాంతానికి చెందిన పిల్లలు లేని దంపతులు తమ రక్తసంబంధీకుల నుండి పాపను చట్టబద్ధంగా దత్తత తీసుకున్నారు. హన్మకొండ, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు దంపతులకు కూడా దత్తత ఉత్తర్వులు అందజేయబడ్డాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు తప్పనిసరిగా చట్టబద్ధమైన దత్తత ప్రక్రియను అనుసరించాలని సూచించారు. రక్తసంబంధీకుల నుండి దత్తత తీసుకోవాలనుకునే వారు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి యం. సరస్వతి, డీసీపీవో పర్వీన్, పి.ఓ తిరుపతి, ఎల్.సి. పి.ఓ రాజు, శిశుగృహ మేనేజర్ ఎ. అపూర్వ, డేటా అనాలిస్ట్ రాజ్ కుమార్ పాల్గొన్నారు. పిల్లలు లేని దంపతులకు చట్టబద్ధ దత్తత ద్వారా కుటుంబ సౌభాగ్యం కల్పించడమే మిషన్ వాత్సల్య లక్ష్యం.

## గ్యాస్ సిలిండర్ లీకేజీ
### - తప్పిన పెను ముప్పు



**పాలకుర్తి, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బండ మహేష్ కుటుంబం మంగళవారం గ్యాస్ సిలిండర్ ప్రమాదం నుండి తప్పించుకుంది. ధర్మారం మండల కేంద్రంలోని రాంసాయి గ్యాస్ ఏజెన్సీ నుండి సిలిండర్ డెలివరీ తీసుకున్న మహేష్, ఇంట్లో స్టౌ ఆన్ చేసే సమయంలో సిలిండర్ నుండి గ్యాస్ లీకవుతున్నట్టు గమనించాడు. వెంటనే భయంతో సిలిండర్‌ను బయటకు తీసుకువెళ్లి పరిశీలించగా వెల్డింగ్ చేసిన ప్రాంతంలో రంధ్రం ద్వారా గ్యాస్ లీకవుతున్నట్టు తేలింది. మహేష్ మాట్లాడుతూ, ఎండాకాలం కావడంతో గమనించకుండా స్టౌ ఆన్ చేసి ఉంటే కుటుంబం మొత్తం ప్రమాదానికి గురయ్యేదని తెలిపారు. సమయానికి గమనించి బయటకు తీసుకువెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

## పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినికి సీఎం చేతుల మీదుగా అరుదైన గౌరవం




**పాలకుర్తి, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామానికి చెందిన ఆకునూరి సాయిశ్రీకి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరుదైన గౌరవం కల్పించారు. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈ గ్రూపులో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించిన సాయిశ్రీకి సోమవారం హైదరాబాద్ ఎల్‌బి స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఒక లక్ష రూపాయల చెక్కును అందజేసి ఘనంగా సత్కరించారు. ఆరేళ్ల క్రితం తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా తల్లి వాణి కూలీ పనులు చేస్తూ కూతుర్ని చదివించింది. ప్రస్తుతం సాయిశ్రీ హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ అరుదైన గౌరవం దక్కడం పట్ల కాలేజీ యాజమాన్యం, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రశంసల వర్షం కురిపించారు. సాయిశ్రీ ప్రతిభకు సీఎం చేతుల మీదుగా లభించిన ఈ గౌరవం గ్రామానికి గర్వకారణమైంది.

## జిల్లా జెడ్పీ డిప్యూటీ సీఈవోగా ఆకుల సంజీవరావు నియామకం



**పెద్దపల్లి, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఓదెల మండలానికి చెందిన ఆకుల సంజీవరావు పెద్దపల్లి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా నియమితులయ్యారు. కరీంనగర్ రూరల్ మండలంలో ఎంపీడీవోగా సేవలందించిన ఆయన పదోన్నతి పొందారు. మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా జెడ్పీ డిప్యూటీ సీఈవోగా ఆకుల సంజీవరావు నియమితులైనందుకు ఓదెల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాల్లో సమర్థవంతంగా పనిచేస్తానని ఆకుల సంజీవరావు సంకల్పం వ్యక్తం చేశారు.

# బండి భగీరథ్‌ను అరెస్టు చేయాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా డిమాండ్




**కరీంనగర్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ తెలంగాణ చౌక్ వద్ద ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా జిల్లా కమిటీల ఆధ్వర్యంలో బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి రిమాండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగరపు రజినీకాంత్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేష్ పటేల్ మాట్లాడుతూ మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని, బండి సంజయ్ తన కుమారుడిని కాపాడేందుకు అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. పోక్సో కేసు నమోదైనప్పటికీ బీజేపీ నాయకత్వం స్పందించకపోవడం మహిళల భద్రతను తాకట్టు పెట్టినట్లేనని వారు విమర్శించారు. బండి సంజయ్ తన కుమారుడి తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తూ మంత్రి పదవిలో కొనసాగడం నైతిక విలువలకు విరుద్ధమని, తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. మైనర్ బాలిక కుటుంబానికి భద్రత కల్పించాలని, బండి సంజయ్ అనుచరుల బెదిరింపులను అరికట్టాలని, సమగ్ర విచారణ జరగాలని కోరారు. భగీరథ్ గతంలో మహేంద్ర యూనివర్సిటీలో ర్యాగింగ్, డ్రగ్స్ వాడకం వంటి చెడు అలవాట్లతో వ్యవహరించాడని, ఇప్పుడు కూడా అదే ధోరణి కొనసాగుతోందని వారు ఆరోపించారు. తక్షణమే అరెస్టు చేసి రిమాండ్ చేయకపోతే డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు కాంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్, సహాయ కార్యదర్శులు దుర్గం బోగేష్, గట్టు ఆకాష్, కమిటీ సభ్యులు రత్నం సురేష్, రాకేష్, సందేశ్, నాయకులు సన్నీ, డివైఎఫ్ఐ ఉపాధ్యక్షులు శివకుమార్, రాజ్ కుమార్, సహాయ కార్యదర్శులు అశోక్, అరవింద్, నాయకులు విజయ్, చందు, సిన, నితిన్ కుమార్, ఐద్వా నాయకురాలు చెనీ రోజా, ఉప్పునూటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి రిమాండ్ చేయాలని, మైనర్ బాలిక కుటుంబానికి న్యాయం జరగాలని నిరసనకారులు స్పష్టం చేశారు.

## ట్రాఫిక్ సమస్యల నివారణకై స్పెషల్ డ్రైవ్



**హుస్నాబాద్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు పోలీసులు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన రహదారులు, జాతీయ రహదారికి అనుసంధానమైన ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్, ఫుట్‌పాత్ ఆక్రమణల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. రోడ్డు ఇరువైపులా హద్దు గీతలు గీసి, వాటిని దాటి వాహనాలు పార్క్ చేస్తే జరిమానాలు విధిస్తామని పోలీసులు హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం వల్ల పాదచారులు రోడ్డుపై నడవాల్సి వస్తోందని, ఇది ప్రమాదాలకు దారితీస్తుందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. దుకాణదారులు వ్యాపార పరిమితులను దాటి వస్తువులు పెట్టవద్దని సూచించారు. సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరి భద్రత కోసం అమలు చేస్తున్నవేనని, వాహనదారులు క్రమశిక్షణతో వాహనాలు నడపాలని, నిర్ణీత ప్రదేశాల్లోనే పార్కింగ్ చేయాలని కోరారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, కానిస్టేబుళు మొగిలి నాయక్, శేఖర్, పోలీసు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించకపోతే చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

## ఏసీబీ వలలో గంగాధర ఇన్‌చార్జ్ ఎస్ఆర్వో



**కరీంనగర్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వెలుగుచూసిన అక్రమాల కేసు కొత్త మలుపు తిరిగింది. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎస్ఆర్వోగా పనిచేస్తున్న మంద కిరణ్ కుమార్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. గతంలో పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా, అనంతరం ఇన్‌చార్జ్ ఎస్ఆర్వోగా పనిచేసిన సమయంలో భారీగా అక్రమ వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు ఆయనపై నమోదయ్యాయి. 2025 నవంబర్ 14న ఏసీబీ అధికారులు కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినప్పుడు రూ. 1,06,500 నగదు, అనుమానాస్పద లావాదేవీలు, అక్రమ వసూళ్లకు సంబంధించిన ఆధారాలు లభించాయి. తదుపరి దర్యాప్తులో నిజామాబాద్‌లోని నివాసంలో మంద కిరణ్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ ఘటనతో రిజిస్ట్రేషన్ శాఖలో కొనసాగుతున్న అవినీతి వ్యవహారాలపై మరోసారి చర్చ మొదలైంది. ప్రజల నుంచి అధిక మొత్తంలో వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలతో రిజిస్ట్రేషన్ శాఖపై విమర్శలు మళ్లీ తీవ్రతరం అయ్యాయి.

## బండి సంజయ్ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ డిమాండ్



**హుస్నాబాద్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన కేసు నేపథ్యంలో హుస్నాబాద్ బీఆర్ఎస్ నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. పట్టణ అధ్యక్షుడు ఎంఏ. అన్వర్ పాషా, మున్సిపల్ కౌన్సిలర్ గాదెపాక రవీందర్ మాట్లాడుతూ, మైనర్ బాలికపై జరిగిన ఘటన దారుణమైందని, మంత్రి హోదాలో కొనసాగేందుకు బండి సంజయ్‌కు నైతిక అర్హత లేదని అన్నారు. వెంటనే రాజీనామా చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్ష విధించాలని, బాధిత బాలిక కుటుంబానికి తక్షణ న్యాయం జరగాలని వారు కోరారు. మంత్రుల కుటుంబాలకు ఒక న్యాయం, సామాన్యులకు మరో న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వంగ వెంకట్రాంరెడ్డి, అలుమల్ల ప్రభాకర్ రెడ్డి, బూర వెంకన్న గౌడ్, పూదరి రవీందర్ గౌడ్, బోజు రవీందర్, చిత్తారి శ్రీనివాస్, దొంతరబోయిన శ్రీనివాస్, గంగం సీతారాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బండి సంజయ్ రాజీనామా చేసి, మైనర్ బాలిక కుటుంబానికి న్యాయం జరగాలని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

## జిల్లా టీఎన్జీవో అధ్యక్షునిగా బొంకూరి శంకర్ ఏకగ్రీవం



**పెద్దపల్లి, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా టీఎన్జీవో సంఘం ఎన్నికల్లో బొంకూరి శంకర్ మరోసారి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. జిల్లా ఏర్పాటు నుండి ఇప్పటివరకు నాలుగు సార్లు వరుసగా ఆయనను ఉద్యోగులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం విశేషం. మంగళవారం పెద్దపల్లి సమూహ జిల్లా కార్యాలయాల సముదాయం ప్రాంగణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ కల్యాణ మండపంలో జరిగిన ఎన్నికల్లో డి. శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా, రవి కుమార్ సహాయక ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నామినేషన్ల ప్రక్రియ నుండి ఎన్నికల వరకు ఆసక్తికరంగా సాగిన ఈ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా ఆయిరెడ్డి సందీప్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షురాలిగా గోపు అనిత, కోశాధికారిగా ఎడ్ల కొమురయ్యతో పాటు ఇతర పదవులకు నాయకులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బొంకూరి శంకర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వరుసగా నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. సందీప్ రెడ్డి మాట్లాడుతూ శంకర్ నాయకత్వంలో ఉద్యోగుల కోసం అంకితభావంతో పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని నూతనంగా ఎన్నికైన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా బొంకూరి శంకర్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికై తన నాయకత్వాన్ని నిరూపించారు.

# సహకార అధికారుల అక్రమాలపై రైతుల ఆగ్రహం






**అమ్రాబాద్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.రైతులకు ఉచితంగా ఇవ్వాల్సిన గన్ని సంచులు అందించకపోవడంతో వారు ఒక్కో సంచి కోసం 30 రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని, అదేవిధంగా హమాలీల కూలీ డబ్బులు కూడా రైతుల నుంచే వసూలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని సదుపాయాలు ఉచితంగా అందిస్తామని చెప్పి ఇప్పుడు మాత్రం ఏదీ అమలు చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు పూర్తి వివరాలు సేకరించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. రైతుల నుండి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.మొక్కజొన్న రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కోట్లు ఖర్చుపెట్టి ప్రారంభించిన తెరుచుకోని ఆరోగ్య కేంద్రం



**అమ్రాబాద్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని రాజీవ్ నగర్ సమీపంలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ప్రారంభోత్సవం జరిగిన రెండు నెలలు గడిచినా ఇప్పటికీ తలుపులు తెరుచుకోలేదు.మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా ఆర్భాటంగా ప్రారంభించిన ఈ కేంద్రంలో వైద్యులు, సిబ్బంది నియామకం జరగకపోవడంతో భవనం తాళం వేసి ఖాళీగా ఉంది. దీంతో స్థానిక ప్రజలు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఓ తారాసింగ్ మాట్లాడుతూ భవనం నిర్మాణం పూర్తయినా ప్రత్యేక వైద్యులు, సిబ్బంది నియామకం ఇంకా జరగలేదని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ఆరోగ్య కేంద్రం ప్రజలకు ఉపయోగపడేలా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రజల ఆరోగ్యానికి నిర్మించిన కేంద్రం తలుపులు మూసి ఉండటం స్థానికుల ఆగ్రహానికి కారణమైంది.

# మర్రిగూడ ఆసుపత్రిలో నర్సుల దినోత్సవం వేడుకలు



**మర్రిగూడ, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి.ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ నాయక్ నర్సులను శాలువాలతో సత్కరించి, కేక్ కట్ చేశారు. "ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలు వైద్యరంగానికి మార్గదర్శకం. రోగుల పట్ల నర్సులు చూపే కరుణ, సేవాభావం అమోఘం" అని ఆయన ప్రశంసించారు.కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం చెయ్యాలి

**- కొత్తపల్లి సత్యనారాయణ చారి**



**హుస్నాబాద్, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను కాపాడి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు కొత్తపల్లి సత్యనారాయణ చారి డిమాండ్ చేశారు.ప్రభుత్వాల నిర్లక్ష్యం, ప్రైవేటు విద్యాసంస్థల ప్రోత్సాహం కారణంగా విద్యా రంగం పూర్తిగా వ్యాపారమైపోయిందని ఆయన విమర్శించారు. ప్రైవేటు పాఠశాలల ఫీజుల భారంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా కుదేలవుతున్నాయని, పిల్లల చదువు కోసం అప్పులు చేయడం, ఆస్తులు అమ్ముకోవడం, మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు, ఇంగ్లీష్ బోధన, సాంకేతిక పరిజ్ఞానం అందించే స్థాయికి చేరితేనే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కేవలం భవనాలు నిర్మించడం సరిపోదని, బోధనా ప్రమాణాలు, డిజిటల్ విద్య, క్రీడలు, సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ విద్య, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంపై సమాన శ్రద్ధ అవసరమని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు బలహీనపడితే పేద పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని హెచ్చరించిన ఆయన, జూన్ 2026 నాటికి రాష్ట్రవ్యాప్తంగా విద్యా అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధానాన్ని తీసుకురావాలని, ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే చదివేలా చట్టబద్ధ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం అయితేనే సమాజంలో సమాన విద్యా అవకాశాలు కలుగుతాయని కొత్తపల్లి సత్యనారాయణ చారి స్పష్టం చేశారు.

# శ్రీశైలంలో ఘనంగా హనుమజ్జయంతి





**శ్రీశైలం, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శ్రీశైలంలోని పాతాళగంగ మార్గంలోని శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా విశేషపూజలు ఘనంగా జరిగాయి.లోకకల్యాణం కోసం అర్చకులు ముందుగా సంకల్పం చేసి, దేశంలో శాంతి--సౌభాగ్యాలు నెలకొనాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా తగినంత వర్షాలు కురవాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.తరువాత మహాగణపతిపూజ నిర్వహించి, భక్తాంజనేయస్వామివారికి పంచామృతాభిషేకం, జలాభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అష్టోత్తరపూజ, నాగవల్లిదళపూజ, వడమాల సమర్పణ, పుష్పార్చన జరిపారు.కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వీ ఎల్ టి డి సి ఏర్పాటుకు అధిక సమయం ఇవ్వాలి



**నందికొట్కూరు, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నంద్యాల జిల్లా ఆత్మకూరు ప్రైవేటు పాఠశాల యాజమాన్యం, మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డికు వినతిపత్రం అందజేసింది.పాఠశాల బస్సుల ఇన్స్పెక్షన్ నిమిత్తం వీ ఎల్ టి డి సి పరికరం ఏర్పాటు చేయడానికి మరింత సమయం ఇవ్వాలని వారు కోరారు.ఈ వినతిపై ఆత్మకూరు ఆర్డీవో స్పందిస్తూ, "మీ సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తాను" అని హామీ ఇచ్చారు.

# అమలాపురంలో ఏపీ వ్యాకస 30వ మహాసభలు

**నందికొట్కూరు, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 30వ మహాసభలు అమలాపురంలో మే 11, 12, 13 తేదీలలో జరుగుతున్నాయి.నంద్యాల జిల్లా నుండి సంఘం ప్రతినిధులు జిల్లా అధ్యక్షుడు ఎం. నాగేశ్వరరావు, కార్యదర్శి నరసింహ నాయక్, మండల నాయకులు ఎం. కరణ, టి. ఓబులేసు, డేవిడ్, రాములమ్మ, మధు శేఖర్, కుళాయి స్వామి, అర్జున్, మద్దమ్మ, ఏసేపు తదితరులు పాల్గొన్నారు.ఈ మహాసభల్లో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కార్మికుల సమస్యలు, సంక్షేమ చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరుగుతున్నాయి.

# తవిసికొండలో జలహారతి

**-- పచ్చదన విప్లవం**





**నంద్యాల, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఒకప్పుడు నీటి కోసం పోరాడిన తవిసికొండ గ్రామం, ఇప్పుడు జలధార--జలహారతి కార్యక్రమంతో పచ్చదనపు మార్గంలో ముందుకు సాగుతోంది.మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం కింద కొండలపై తవ్విన కందకాల వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకిపోవడంతో బోర్లలో నీటి మట్టం నిలకడగా ఉంది. గతంలో బోడిగా కనిపించిన కొండలు ఇప్పుడు చెట్లతో కళకళలాడుతున్నాయి.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రత్యేక చొరవతో రూ.4.95 లక్షలు మంజూరు చేసి, బూర్గుల చేనుకొండ ప్రాంతంలో 50 మంది శ్రామికులు పనులు చేస్తున్నారు. ఉపాధితో పాటు ప్రకృతి సంరక్షణ కలిసొస్తుండటంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.గ్రామ పెద్దలు మాట్లాడుతూ, "మునుపు వర్షం పడితే నీళ్లు పారిపోయేవి. ఇప్పుడు కందకాల వల్ల నీరు భూమిలోనే నిలుస్తోంది. బోర్లలో నీరు తగ్గలేదు. పండ్ల తోటలు పెరుగుతున్నాయి" అని సంతోషం వ్యక్తం చేశారు.హుసేనాపురంలో నీటి లభ్యత పెరిగి రైతులు విస్తృతంగా పండ్ల తోటలు పెంచుతున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రకృతిని కాపాడితే ప్రకృతి మనలను కాపాడుతుంది. జలహారతి గ్రామాల భవిష్యత్తును మార్చే ఉద్యమం" అని పిలుపునిచ్చారు.

# పంటల వైవిధ్యీకరణ అవసరం

**- ఉద్యానాధికారి సూచన**



**నందికొట్కూరు, మే 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రస్తుతం ఉల్లి సాగు అధిక విస్తీర్ణం పెరగడంతో మార్కెట్‌లో ధరలు పడిపోవడం, ఉత్పత్తి వ్యయం పెరగడం, తెగుళ్ల సమస్యలు ఎక్కువవడం వల్ల రైతులకు లాభదాయకత తగ్గుతోందని ఉద్యానాధికారి తేజస్విని తెలిపారు.దామాగట్ల గ్రామంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, "రైతులు సంపూర్ణంగా ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణ వైపు దృష్టి పెట్టాలి. సాంప్రదాయ ఉల్లి సాగు బదులుగా మిశ్రమ పంటలు, అంతర పంటలు చేపట్టాలి. లోకల్ విత్తనాల స్థానంలో ఇంప్రూవ్డ్ రకాలు వాడాలి" అని సూచించారు.నీటి పొదుపు, అధిక దిగుబడి కోసం డ్రిప్ సిస్టమ్, రైజ్డ్ బెడ్ టెక్నాలజీ వాడాలని, మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అరటి, బొప్పాయి, మామిడి, జామ, చీని, డ్రాగన్ ఫ్రూట్ వంటి దీర్ఘకాలిక ఆదాయ పంటల వైపు రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. నీటి వనరులు, నేల అనుకూలత ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలని కోరారు.అగ్రికల్చర్ అసిస్టెంట్ శాంతిరాజు మాట్లాడుతూ, "రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయ దిశగా సాగితే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చు. ప్రస్తుతం పీఎం డీఎస్ విత్తనాలు భూసారాన్ని పెంచుతున్నాయి" అని వివరించారు.కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కలిముల్లా షాఖాద్రీ, గ్రామ రైతులు ఉసేనయ్య, విల్సన్, నాగభూషణప్ప తదితరులు పాల్గొన్నారు.